నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ ఆదివారం 28 జూలై 2024 | ADILABAD NIRMAL




అటవీ ప్రాంతం నుంచి కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

## నాలుగు కిలో మీటర్లు..

నర్సాపూర్(టి) ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం సిరిచెల్మ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ, బుర్సుగుట్ట, ధర్మాజీపేట్ గ్రామానికి శనివారం వైద్య సిబ్బంది కాలినడకన నాలుగు కిలో మీటర్లు నడిచి వెళ్లి వైద్య అందించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్ఎం రేణుక, ఆశ కార్యకర్త సరోజ పాల్గొన్నారు. - ఇచ్చోడ, జూలై 27



# వాగులు దాటి.. వైద్యం అందించి

### మారుమూల గ్రామాలకు వెళ్లి వైద్యం అందిస్తున్న వైద్యులు



వాగు దాటుతూ..




గోపాల్‌పూర్ వాగును దాటుతున్న వైద్యులు ప్రతాప్ నాయక్, పూజిత, వైద్య సిబ్బంది

'వైద్యో నారాయణో హరీ' అన్నారు పెద్దలు. ఈ వ్యాఖ్యాన్ని అక్షరాల నిరూపిస్తున్నారు ఆదిలాబాద్ ప్రభుత్వ వైద్యులు. వాగులు, వంకలు దాటి మోకాలు లోతు బురదలో నుంచి వెళ్లి తండాలు, గూడేలు, మారుమూల పల్లెల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రాళ్లు, రప్పలు, గుట్టల నుంచి వెళ్లి వైద్యం అందిస్తున్నారు. రోగులను పరిశీలించి మందులు అందిస్తున్నారు. తాజాగా శనివారం ఇంద్రవెల్లి, ఆదిలాబాద్ రూరల్, ఇచ్చోడ మండలాల్లో వైద్యులు శిబిరాలు నిర్వహించారు.

హీరాపూర్ పంచాయతీ పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పిట్టబొంగురం పీహెచ్‌సీ వైద్యులు ప్రతాప్‌నాయక్, పూజితలు వర్షం కురిసినా వాగులు, వంకలు దాటి శిబిరానికి వెళ్లారు. రోగులకు రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జలంధర్, గంగమ్మ, మాధవి, దివ్య, సుర్యకల, విజయసుందరి, విజయ్‌కుమార్, శివరంజని పాల్గొన్నారు. - ఇంద్రవెల్లి, జూలై 27



గిరిజనులకు వైద్యం అందిస్తున్న వైద్యులు



ఎండ్లబండిపై గ్రామానికి వెళ్తూ..

బురదలోనుంచి నడుచుకుంటు వెళ్తున్న వైద్యసిబ్బంది ➤

## పది కిలో మీటర్లు ..

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి పీహెచ్‌సీ పరిధిలో గల అశోద, బొప్పాపూర్, పూనగూడ, మంగ్లీ, శివగూడా, అలికోరి, తిప్ప, అడ్డగుట్ట గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు కాలి నడకన పది కిలో మీటర్లు వెళ్లి వైద్యం అందించారు. వాగులు దాటి, మోకాలి లోతు బురదలో బండి మీద వెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో ఎండ్ల బండిపై ప్రయాణించారు. కష్టపడి అక్కడికి చేరుకోని టీకాలు, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి తిరిగి అదే మార్గంలో పీహెచ్‌సీకి చేరుకున్నారు. కాగా.. ఇమ్యూనైజేషన్ చేసిన వారిలో మెడికల్ ఆఫీసర్ సర్ఫరాజ్ ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్లు ముయ్యాల మోతి, పవర్ ప్రేమ్‌సింగ్, నారాయణ రాథోడ్, శైలజా పవర్, సత్యవతి, లలిత, వైద్యసిబ్బంది ఉన్నారు. కనీసం రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. - ఎదులాపురం, జూలై 27




మురికి నీటిలో ఉన్న చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకుంటున్న కొలాం ఆదివాసీ గిరిజన మహిళలు

బొడ్డిగూడ గ్రామంలోని కొలాం ఆదివాసీ గిరిజనులు కలుషిత నీటిని తాగుతూ రోగాల పాలవుతున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదని, చేతి పంపు కూడా పని చేయడం లేదని గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామానికి కొద్ది దూరంలో వ్యవసాయ బావికి అనుకుని, మురికినీటిలో ఉన్న చేతి పంపు ద్వారా నీటిని తీసుకొచ్చుకుంటున్నామని ఆవేదన చెందారు. ఆ నీరు వాసన, వ్యాధులు కూడా వస్తున్నాయని మండిపడుతున్నారు. గ్రామానికి కొద్ది దూరంలో చేతి పంపు ఉందని, రాత్రిపూట తాగునీటిని తీసుకురాలేని పరిస్థితి ఉందన్నారు. మధ్యలో చిన్న వాగు ఉండడంతో వర్షాలు కురిస్తే వరద నీటితో చేతి పంపుకు పోలేని పరిస్థితి ఉందన్నారు. ఒక్కసారి నీటిని తీసుకొచ్చుకుంటే ఆ నీటిని రెండు, మూడు రోజులు తాగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. - ఇంద్రవెల్లి, జూలై 27



మురికి నీటిలో ఉన్న చేతిపంపును పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

## లెక్క తేల్చిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఎదులాపురం, జూలై 27 : రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని, బీసీ రిజర్వేషన్లను ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సమగ్ర కులగణన సాధన యాత్ర శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నది. ఈ యాత్రలో భాగంగా స్థానిక ఆర్ఎస్ గార్డెన్స్‌లో సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు పెద్ద ఎత్తున బీసీలు తరలి వచ్చారు. జనాభాలో సగం ఉన్న బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ డిమాండ్లను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీల జనాభా అత్యధికంగా ఉన్నప్పటికీ నానాటికీ రాజకీయంగా అణగదొక్క బడుతున్నారని గుర్తు చేశారు. పదవుల కేటాయింపుల్లో తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంత వరకు కుల గణన చేపట్టడం లేదన్నారు. బీసీల రిజర్వేషన్లు ఖరారు చేయకుండా ఎన్నికలకు వెళ్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, సభ్యులు మంచికట్ల ఆశమ్మ, నర్సాగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



రోడ్డుపై నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న లింబా(కే) గ్రామస్తులు

## నాటేసి నిరసన

కుంటాల, జూలై 27 : లింబా (కే) గ్రామంలోని ఊరి మధ్యలో గల రోడ్డు వర్షాలతో బురదమయం అయింది. దీంతో నడవడానికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. శనివారం రోడ్డుపై బురదలో నాట్లు వేసి నిరసన తెలిపారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కంటైనర్‌లో పశువులు

## పశువుల పట్టివేత

నేరడిగొండ, జూలై 27 : రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నట్లు నేరడిగొండ ఏఎస్ఐ మారుతి తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉత్తరప్రదేశ్ నుంచి కేరళకు వెళ్తున్న కంటైనర్(ఆర్‌జె 11జీసీ 7392)ను తనిఖీ చేశారు. ఇందులో 54 పశువులు ఉన్నట్లు గమనించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పంచనామా నిర్వహించి లారీతోపాటు పశువులను ఇచ్చోడ గోశాలకు తరలించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దానిష్, అజీమ్, షాహీద్, ఆసీఫ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### గోవులు..

నిర్మల్ అర్బన్, జూలై 27 : అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని యువకులు పట్టుకుని శనివారం పోలీసులకు అప్పగించారు. కెరమెరి నుంచి భైంసా వైపు బొలేరో వాహనంలో గోవులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు యువకులు వాహనాన్ని తనిఖీ చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని గోవులను గోశాలకు తరలించారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

బోథ్, జూలై 27 : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. శనివారం బోథ్ బస్టాండ్ ఎదుట కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, మూసినది అభివృద్ధికి నిధులు, మెట్రో రైల్ విస్తరణ వంటి వాటికి నిధుల కేటాయింపులు చేయకపోవడం ముమ్మాటికి తెలంగాణను వంచించడమే అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ రాజు యాదవ్, అబ్రార్, చెట్ల ఉమేశ్, భోజన్న, అబుద్, మహమ్మద్, రహీముద్దీన్, షేక్ షాకీర్, హసీబ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

## ధర్నాకు సెలవు ఇవ్వాలని వినతి

నిర్మల్ అర్బన్, జూలై 27 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 31న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం కార్మికులను సెలవు ఇవ్వాలని కోరుతూ శనివారం తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ అండ్ యూనియన్ సభ్యులు డీఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేశ్ ఉన్నారు.

## డబుల్ బెడ్రూంల వద్ద ఆందోళన

భైంసా, జూలై 27 : పట్టణంలోని డబుల్ బెడ్రూంల వద్ద నిరసన కార్యక్రమం శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లక్కీ డ్రా ద్వారా డబుల్ బెడ్రూంలు మంజూరయ్యాయని, వాటిని వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో గిరిధర్ జంగ్మే, మహేశ్, రాంచందర్, భాస్కర్, వకీల్, ఇర్ఫాన్, నయిం ఉన్నారు.



డబుల్ బెడ్రూంల వద్ద నిరసన చేపడుతున్న లబ్ధిదారులు